సాక్షి
వికారాబాద్

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



మద్యం సీసాల కోసం హత్య

చోరీ చేసిన మద్యం సీసాల పంపకం విషయంలో తలెత్తిన వివాదం ఓ యువకుడి ప్రాణం తీసింది.

10లో▸



స్వామివారి లడ్డూ ప్రసాదం

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్



విధుల్లో చేరిన సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు: తాండూరు సబ్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ శ్రీనివాస్‌రావు రిలీవ్ అయ్యి సబ్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. తాండూరు రెవెన్యూ డివిజన్‌కు ఆరేళ్ల తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయ హోదా వచ్చింది.

రుణమాఫీపై ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి

పెద్దేముల్: రుణమాఫీ పథకం అమలు కాని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తట్టిపల్లిలో రైతులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేని రైతులకు సంబంధించి కుటుంబ నిర్ధారణ సర్వే కొనసాగుతోందన్నారు. ఈ నివేదిక తర్వాత రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

చెరువు గండికి మరమ్మతులు



చెరువు గండిని పూడ్చుతున్న ప్రజలు

కుల్కచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లి చెరువుకు గండి పడటంతో శుక్రవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. స్థానికుల సహకారంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఏఈఈ సిద్ధార్థ మాట్లాడుతూ.. చెరువుకు గండి పడిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలియడంతో తాత్కాలిక ప్రాతిపాదికన మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాత శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



శివకుమార్ మృతదేహం

యాలాల: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడటంతో పదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని దౌలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డే వెంకటప్ప, మల్లమ్మ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలల క్రితం వెంకటప్ప నివాసం ఉంటున్న ఇల్లు కూలిపోవడంతో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ భవనం పైభాగంలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. జీపీ భవనం ముందు నీటి అవసరాల కోసం భారీ సంపును నిర్మించారు. అక్కడి ప్రజలు ఆ నీటినే వాడుకుంటున్నారు. శుక్రవారం ఉదయం వెంకటయ్య రెండో కుమారుడు శివకుమార్(10) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు మృతదేహాన్ని బయటకి తీసి యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నీటి సంపులో పడి మృతి చెందిన బాలుడు శివకుమార్ కుటుంబానికి డాక్టర్ సంపత్‌కుమార్, ఆర్‌బీఎల్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. స్థానిక నేతలు లక్ష్మయ్య ముదిరాజ్, వడ్డే రాములు చేతుల మీదుగా సాయాన్ని అందజేశారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లంలో బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు.



దుద్యాల్: గణనాథుడి విగ్రహాన్ని మండపానికి తరలిస్తున్న నిర్వాహకులు

రారా గణపయ్య

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. వివిధ రూపాల్లో తయారు చేసిన భారీ ప్రతిమలను నిర్వాహకులు మండపాలకు తరలించారు. మండపాలను పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. శనివారం పండుగ నేపథ్యంలో శుక్రవారం మార్కెట్లలో సందడి కనిపించింది. విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. యువకులు, చిన్నారులు సైతం విగ్రహాలను కొనుగోలు చేశారు. వీధులు గణేశ్ మండపాలతో కళకళలాడుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



తాండూరు: పట్టణంలోని వినాయక చౌక్ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపం





విగ్రహాలు, పూలు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం



బషీరాబాద్: విగ్రహాన్ని తరలిస్తున్న చిన్నారులు, యువకులు



మార్కెట్‌లో కొలువుదీరిన గణేశ్ ప్రతిమలు

మతసామరస్యాన్ని చాటుదాం

- ఎస్పీ నారాయణరెడ్డి
- వికారాబాద్‌లో పీస్ కమిటీ సమావేశం
- పోలీసులకు సహకరించాలని సూచన



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ముస్లిం మత పెద్దలు, వివిధ కమిటీల సభ్యులు, సంబంధిత అధికారులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అసత్య ప్రచారాలను నమ్మరాదని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. వికారాబాద్ అంటేనే మత సామరస్యతను చాటుతుందని, దానిని అందరూ కాపాడుకోవాలన్నారు. గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి మండపం వద్ద, మిలాద్ ఉన్ నబీ ర్యాలీల్లో వలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల మాట్లాడుతూ.. రానున్న పండుగలను ఘనంగా జరుపుకొంటామన్నారు. ఉత్సవాలకు మున్సిపల్ తరఫున ఏర్పాట్లు చేస్తామని, పోలీసులకు సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా కమిటీల సభ్యులు మాధవరెడ్డి, తస్వర్ అలీ, సీఐ నాగరాజు, ఎక్సైజ్ సీఐ రాఘవీణ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నాయకులు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ఎర్రవల్లి జాఫర్, రాజశేఖరరెడ్డి, శివరాజు, కేపీ రాజు, ముత్తాహర్ షరీఫ్, ఉస్మాన్, అలీమొద్దీన్, సర్పరాజ్, హాజీ, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరువు స్థలాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేయొద్దు

కలెక్టర్ ప్రతీక్ జైన్

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్తులు, వనరులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. చౌడాపూర్ మండలం లింగంపల్లిలోని (మ్యాక) చెరువు కట్టను కొందరు కూల్చివేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వనరులను ధ్వంసం చేస్తే సహించేది లేదన్నారు. 1952లోనే ఇక్కడ చెరువు, కట్ట ఉన్నట్లు నక్ష, రికార్డుల్లో ఉందన్నారు. తూములను కూల్చడం సరైందికాదని అన్నారు.ఏదైన సమస్య ఉంటే చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారు. వెంటనే కట్టను సరిచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో చెరువు పరిసరాలను సర్వే చేసి నివేదిక అందజేయాలన్నారు. అనంతరం మండలంలోని పీరంపల్లి సర్వే నంబర్లు 709, 06లో భూముల సరిహద్దు సమస్యను స్థానిక అధికారులు, రైతులతో మాట్లాడారు. భూ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్ఐ అన్వేష్‌రెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం శోభ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి పూర్ణచందర్‌రావు



రికార్డులను పరిశీలిస్తున్న పూర్ణచందర్‌రావు

ధారూరు: జిల్లాలోని పశువైద్య కేంద్రాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మహిళా అటెండర్ల స్థానంలో వారి సంబంధీకులు పనిచేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం ధారూరు పశువైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నాగారం పశువైద్యశాలలో మహిళా అటెండర్ స్థానంలో ఆమె భర్త పని చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ధారూరు పశువైద్య కేంద్రం డాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారని, వీరిలో ఎవరైన ఇతరుల ద్వారా డ్యూటీ చేయిస్తే ఉపేక్షించేది లేన్నారు. విచారణలో నిజం తేలితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. జీవాలకు సకాలంలో వాక్సినేషన్ చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. గత నెలలో నాగారం రైతు అల్లిపూర్ దశరథ తన మేకకు సకాలంలో వైద్యం అందక మృతి చెందడంతో దాని కళేబరాన్ని పశువైద్యశాల పైన ఉన్న బోర్డుకు వేళాడదీయడం సీఎం దృష్టికి వెళ్లిందన్నారు. ఈ కారణంగానే అక్కడి డాక్టర్ సురేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఆగస్టు 13న రెండు రైళ్లు మేకలను ఢీకొన్న సంఘటనలో 66 జీవాలు మృతి చెందాయని, బాధిత రైతుకు పరిహారం వచ్చేలా సీఎంకు నివేదిక పంపామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువులు, మేకలకు పరిహారం విద్యుత్ శాఖ ద్వారా వస్తుందని చెప్పారు.

సీపీఆర్‌తో దక్కిన చిన్నారి ప్రాణాలు

ఆమనగల్లు: ఓ చిన్నారి (15 నెలలు) అపస్మారక స్థితిలో ఉండగా ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గ పరిధిలోని గుంపెనిపల్లికి చెందిన రాజేశ్వరి, భరత్ దంపతులు. తమ చిన్నారితో కలిసి ఆటోలో శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆమనగల్లు పట్టణ సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్దకు రాగానే చిన్నారి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ అపస్మారక స్థితికి చేరుకుంది. అదే సమయంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు డా.పరిక్షిత్ నరేందర్, నాగరాజు విధులు ముగించుకుని కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా విషయం తెలుసుకున్నారు. వెంటనే చిన్నారికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. చిన్నారి ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్కారు గోదాంలను సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకోవాలని ఐసీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్) డిప్యూటీ డైరెక్టర్ నీలుపాండే అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన నీలుపాండే మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లిన సమయంలో రేటు తక్కువగా ఉన్నట్లయితే విక్రయించకుండా నిల్వ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం గోదాంలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. పంట నిల్వ చేసుకునేందుకు రైతులు తక్కువ మొత్తంలో రుసుము చెల్లించాల్సి ఉంటుందని, నిల్వ చేసిన దానికి సంబంధించిన విలువ (వాల్యుయేషన్)ను రాసి ఒక రిసీట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ గోదాంలో ఇచ్చిన వాల్యుయేషన్‌పై ఏ బ్యాంకులోనైనా 70శాతం రుణం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఎం లెక్చరర్ అరుణ్‌కుమార్, ఎస్ఈఆర్ఎల్, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రవికుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు బక్కన్నయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా పాండురంగారెడ్డి, సీఈఓలు రఘునందన్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

అనంతగిరి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశంలో గురువులకు విశేషమైన స్థానం ఉందన్నారు. మన విజయంలో వారి పాత్ర కచ్చితంగా ఉంటుందన్నారు. సమాజంలో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదివి ఉన్నతంగా రాణించేలా టీచర్లు కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ బాబుసింగ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నర్సింలు, బాబ్యా నాయక్, రాఘవేందర్, అంజిరెడ్డి, వినోద్‌కుమార్, బసప్ప, విష్ణువర్ధన్, వెంకటయ్య, ఎండీ అరీఫ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్ తదితరులు

బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు రండి

సీఎం రేవంత్ రెడ్డికి ఉత్సవ సమితి ఆహ్వానం



బడంగ్‌పేట్: లడ్డూకు ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుని నవరాత్రుల ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉత్సవ సమితి నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని సీఎం నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. బాలాపూర్ గణనాథుడిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను కాపాడండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువలను కాపాడాలని కోరుతూ మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు శుక్రవారం నగరంలోని హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు తోడవడంతో మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు, కొత్త చెరువు, ఎర్రకుంట, గంగరాయి చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు ముంజ కుంట, రేగుల కుంట వాగులు అన్యాక్రాంతం అయ్యాయని పేర్కొన్నారు. హైడ్రా అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించడంతో పాటు, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు జీఆర్ కరుణాకర్, బోసుపల్లి ప్రతాప్, గుత్తా మహేందర్ రెడ్డి, డి.కిషన్, కళ్యాణ్ నాయక్, కొంతం యాదిరెడ్డి, రావుల వీరేశం, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి
ఎస్ఐ సంతోష్ కుమార్



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్ఐ

పరిగి: ఫోన్లు పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. ఠాణా పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు రికవరీ చేసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మార్కెట్‌లో, ఇతర ప్రదేశాల్లో నిత్యం మొబైల్ ఫోన్లు దొంగలించబడుతున్నాయన్నారు. బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫోన్ దొరికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

పాము కాటుకు పాడిగేదె మృతి



గేదె కళేబరం వద్ద రైతు

ధారూరు: పాము కాటుకు పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన బీర్ల పాండు పాడిగేదెను గురువారం పొలంలో మేపుతున్న సమయంలో పాము కాటుకు గురైంది. గమనించని రైతు సాయంత్రం పాకలో కట్టేసాడు. రాత్రి వర్షం కురుస్తుండటంతో బయటకు రాలేదు. ఉదయం వచ్చి చూడగా నురగలు గక్కుతూ నిర్జీవంగా పడి ఉంది. గమనించిన రైతు పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. వెటర్నరీ సిబ్బంది పంచనామా చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. గేదె మృతి చెందడంతో రూ.50వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి



బసిరెడ్డి మృతదేహం

తాండూరు టౌన్: ఇంట్లో కిందపడిపోయి ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు విజపురం బసిరెడ్డి(66) సాయంత్రం ఒక్కసారిగా ఇంట్లోనే కింది పడిపోయాడు. దీంతో తలకు గాయాలై చెవి నుంచి రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖరాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం సీసాల కోసం హత్య

- ఘటనా స్థలిలో లభ్యమైన పర్స్ ఆధారంగా కేసు దర్యాప్తు
- డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, చిత్రంలో సీఐ, ఎస్ఐ

తాండూరు రూరల్: చోరీ చేసిన మద్యం సీసాల పంపకం విషయంలో తలెత్తిన వివాదం ఓ యువకుడి ప్రాణం తీసింది. శుక్రవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హత్య వివరాలు వెల్లడించారు. పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండమీదిపల్లి రమేశ్(32) మృతదేహం ఆగస్టు 31న గోపాల్‌పూర్ శివారులోని ఓ సుద్ద గుంతలో లభ్యమైంది. మృతుడి తల్లి తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలిలో లభ్యమైన పర్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఆ వాలెట్‌లో బంట్వారం మండలం సల్‌బత్తాపూర్ గ్రామానికి చెందిన ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ ఉన్నాయి. దీంతో శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా రుద్రారం గ్రామానికి చెందిన బండమీదిపల్లి నరేశ్‌తో కలిసి హత్య చేసినట్లు అంగీకరించాడు.

కారు అద్దాలు ధ్వంసం చేసి..

రుద్రారం గ్రామానికి చెందిన నరేశ్ హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరులో నివసిస్తున్నాడు. సల్‌బత్తాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ నరేశ్‌ను కలిసి పని చూపించాలని కోరారు. పని దొరక్కపోవడంతో ఇద్దరూ కలిసి ఆగస్టు 29న సల్‌బత్తాపూర్ గ్రామంలోని ఓ కారు అద్దాలు ధ్వంసం చేసి అందులోని కెమెరాలను దొంగిలించారు. ఇదే విషయమై బంట్వారం ఠాణాలో కేసు నమోదైంది.

మద్యం సీసాల పంపకాల్లో పంచాయితీ

పంపకంలో తేడా రావడంతో హత్య.. ఈ నెల 30న నరేశ్, శ్రీకాంత్ బైక్‌పై తాండూరుకు వచ్చారు. ఇదే క్రమంలో రుద్రారం గ్రామానికి చెందిన రమేశ్ కనిపించాడు. ముగ్గురు కలిసి పెద్దేముల్‌లో మద్యం సేవించారు. అది చాల్లేదని మండల కేంద్రంలోని కల్లు దుకాణానికి వెళ్లారు. అక్కడ 13 క్వార్టర్ సీసాలు దొంగతనం చేశారు. వీటి పంపకం విషయంలో నాకు ఎక్కువగా ఇవ్వాలని రమేశ్ కోరడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. చోరీ విషయం బయట చెబుతాడనే ఆందోళనలో రమేశ్ అంతమొందించాలని శ్రీకాంత్, నరేశ్ కుట్రపన్నారు. గ్రామానికి వెళ్లే క్రమంలో నరేశ్ బెల్ట్‌ను రమేశ్ మెడకు చుట్టి చెరోవైపు గట్టిగా లాగడంతో మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని గోపాల్‌పూర్‌లోని ఓ సుద్దగుంతలో పడేసి వెళ్లారు. పర్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి.. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ గిరి ఉన్నారు.

అమ్మకు బాగోలేదు.. అంబులెన్స్ పంపండి!

108కు ఫోన్ కాల్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పైలెట్స్
- న్యూసెన్స్ కేసు నమోదు

బషీరాబాద్: 'మా అమ్మకు ఆరోగ్యం బాగోలేదు.. అర్జెంటుగా అంబులెన్సు పంపండి' అంటూ ఓ వ్యక్తి 108కి కాల్ చేశాడు. అక్కడి చేరుకున్న అంబులెన్స్ సిబ్బందిని అక్కడకి రా.. ఇక్కడికి రా.. అంటూ ఓ ఆకతాయి ఆటపట్టించాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన బోయిని బాల్‌రాజ్ శుక్రవారం ఉదయం 7.30 గంటలకు 108 కాల్ సెంటర్‌కు కాల్ చేశాడు. వెంటనే బషీరాబాద్‌లో ఉన్న అంబులెన్స్ పైలెట్‌కు కాల్ సెంటర్ నుంచి సమాచారం అందింది. 108 వాహనం అక్కడకు చేరుకుని కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసిన నంబర్‌కు ఫోన్ చేయగా తను ఊర్లో లేనని.. నావంద్గి రైల్వే స్టేషన్ దగ్గరకు వచ్చి తనను తీసుకెళ్లమన్నాడు. అలా కుదరదనడంతో పది నిమిషాల్లో వస్తాను అక్కడే ఉండండి అంటూ సమాధానం ఇచ్చి పెట్టేశాడు. కాసేపటి మళ్లీ ఫోన్ చేయగా ఎంతకూ సమాధానం ఇవ్వలేదు. దీంతో అంబులెన్స్ ఈఎంటీ విష్ణు బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే వ్యక్తి ఉదయం 10.46గంటలకు మరో సారి 108కి కాల్ సెంటర్‌కు కాల్‌చేసి అమ్మకు ఎమర్జెన్సీ ఉందని చెప్పాడు. తాండూరు జిల్లా ఆస్పత్రి నుంచి మరో అంబులెన్స్ బయలుదేరింది.



బోయిని బాల్‌రాజ్

30కి.మీ దూరంలో ఉన్న మంతన్‌గౌడ్ గ్రామానికి ఉదయం 11.15 గంటలకు అంబులెన్స్ చేరుకుంది. ఆకతాయి చెప్పిన అడ్రస్‌కు వెళ్లి కాల్ చేస్తే నేను బిజీ ఉన్న మా అమ్మను హాస్పిటల్‌కు తీసుకెళ్లండని సమాధానం ఇచ్చాడని ఈఎంటీ సంజీవ్ తెలిపాడు. వారు ఆరాతీయగా వాళ్ల అమ్మకు ఎలాంటి ఎమర్జెన్సీ లేదని తెలిసింది. దీంతో 108 సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఈఎంటీలు విష్ణు, సంజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై న్యూసెన్స్ కేసు నమోదు చేశామని ఎస్ఐ గఫార్ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున

అనంతగిరి. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న వరి, పత్తి పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త సి.యమున రైతులకు సూచించారు. విస్తారంగా కురిసిన వర్షాల వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. మరో నెల రోజులు అప్రమత్తంగా ఉండి పంటను ఎప్పటికప్పుడు గమనిస్తూ చీడపీడలను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ నివారణ చర్యలను వివరించారు. పత్తి పంటలో నీరు నిల్వ ఉండే పొలాల్లో అత్యంత వేగంగా పెరిగే పారావిల్ట్‌ని గమనించవచ్చు. వ్యాధి సోకిన మొక్కల ఆకులు వాడిపోవడం మరియు మొక్కలు ఎండిపోవడం, మొక్కల యొక్క ఆకుల రంగు మారడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఈ తెగులు విస్తరించే కొద్దీ ఆకులు ఎరుపు రంగులోకి మారుతాయి. వేగంగా పెరిగే మొక్కలు మరియు అధికంగా పై ఆకులు మరియు అధిక మొత్తంలో పత్తికాయలు ఉన్న మొక్కలలో ఈ రుగ్మత అధికంగా ప్రభావం చూపుతుందన్నారు. వర్షపాతం తగ్గిన అనంతరం మొక్కలు కోలుకున్నప్పటికీ దిగుబడి మాత్రం తగ్గుతుందన్నారు. నీరు నిలువ ఉండకుండా తొలగించాలన్నారు. సాధ్యమైనంతవరకు మొక్కల వేర్లకు గాలి తగిలేటట్లు చూసుకోవాలన్నారు.



ధారూరు: గురుదోట్లలో దెబ్బతిన్న పెసర పంట వివరాలను నమోదు చేస్తున్న ఏడీఏ స్వరూప

దెబ్బతిన్న పంటల పరిశీలన

ధారూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాలకు పాడైన పెసర పంట పొలాలను శుక్రవారం వికారాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వరూప ఏఈఓ సంజూరాథోడ్‌తో కలిసి పరిశీలించారు. వానలకు సేకరించకండా పొలాల్లోనే వదిలివేసిన పెసర కాయలు మొలకెత్తడాన్ని ఆమె గమనించారు. రైతుల సమక్షంలో పాడైన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ధారూరు క్లస్టర్‌లో ఏఈఓ సంతోష్ దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

మూడు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి



ఘటనా స్థలిలో లారీ, డీసీఎం

పరిగి: మండల పరిధిలో జరిగిన మూడు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చిట్యాల సమీపంలో సిమెంట్ ట్యాంకర్, డీసీఎం ఎదురెదుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పరిగి తరలిస్తుండగా మార్గమధ్యలో కంసాన్‌పల్లి గ్రామం గిరాయిగుట్టతండాకు చెందిన క్లీనర్ పాత్లావత్ రవి(38) మార్గమధ్యలోనే మృతి చెందాడు. హన్మస్‌గండి సమీపంలో హైదరాబాద్

పలువురికి గాయాలు

వెళ్తున్న కారు వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో కారులో ఉన్న కిరణ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చింతల్‌కుంట సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరానికి తీసుకెళ్లారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగారం పంచాయతీని ఎస్సీ రిజర్వుడుగా ప్రకటించండి
కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీని ఎస్సీ రిజర్వుడు జీపీగా ప్రకటించాలనీ శుక్రవారం పలువురు గ్రామస్తులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను విన్నవించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వుడుగా ప్రకటించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో 648 మంది జనా భా ఉండగా 300 మంది ఓటర్లున్నారని.. ఇ ప్పటి వరకు ఎస్సీ మినహాయిస్తే ఇతర సామాజిక వర్గాల వారికే అవకాశం లభించిందన్నారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు పంచాయతీగా ప్రకటించాలని కోరు తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వివాహిత అదృశ్యం



రేష్మాబేగం(ఫైల్)

తాండూరు టౌన్: తాండూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన హుస్సేన్‌ఖాన్ భార్య రేష్మాబేగం(43) ఈ నెల 1న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫీజులో డిస్కౌంట్ అంటూ రూ.18.5లక్షలకు టోకరా
ఇప్పటికే 30 మందికి కుచ్చుటోపీ

శంకర్‌పల్లి: అమాయకులకు మాయమాటలు చెప్పి బురిడీ కొట్టించే వారిని తరచూ చూస్తూనే ఉన్నాం.. అచ్చం అలాంటి ఘటనే శుక్రవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లా ఖాన్ తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన పి.ప్రభావతి రెడ్డి గృహిణి. ఆమె కూతురు గత మార్చిలో ఇంటర్ పూర్తి చేసుకుది. ఉన్న ఒక్కగానొక్క కూతురును సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం వర్సిటీలో ఇంజినీరింగ్ చేయించాలనుకున్నారు. దీంతో జూలై 12న భర్త విఠల్‌రెడ్డి కూతురును తీసుకుని గీతం వర్సిటీకి వెళ్లారు. అక్కడ అనిల్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి తాను అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసే వ్యక్తిని అని పరిచయం చేసుకున్నాడు. నాలుగేళ్లకు కలిపి కళాశాల ఫీజు రూ.16లక్షలు అవుతుందని.. తన ద్వారా ఫీజు ఏక కాలంలో చెల్లిస్తే రూ.5లక్షల వరకు రాయితీ ఇప్పిస్తానని నమ్మబలికాడు.

కేఫ్‌లో భాగస్వామ్యం పేరిట రూ.7.5లక్షలు

ఈ క్రమంలో కళాశాల ఫీజుకు డబ్బు తీసుకెళ్లమని ప్రభావతి, విఠల్‌రెడ్డి దంపతులు అనిల్‌కుమార్‌రెడ్డిని ఇంటికి ఆహ్వానించారు. అనిల్‌రెడ్డి తన స్నేహితుడు రోహిత్ కేశవరాజును వెంటబెట్టుకుని వచ్చి సినీ రచయితగా పరిచయం చేశాడు. ఈ క్రమంలో వారు అనిల్ రెడ్డి రూ.11లక్షల కళాశాల ఫీజు ఇచ్చారు. రోహిత్ తనకు హైటెక్ సిటీలో కేఫ్ ఉందని నమ్మించాడు. తాను అనిల్ మరో కేఫ్ ప్రారంభిస్తున్నామని మీరు భాగస్వాములుగా ఉండొచ్చని నమ్మించారు. అందుకు రోహిత్‌కు రూ.7.5లక్షలు ముట్టజెప్పారు.

వర్సిటీలో ట్విస్ట్

ప్రభావతి, విఠల్‌రెడ్డి దంపతులు అనిల్, రోహిత్‌కు రూ.18.5లక్షలు ముట్టజెప్పారు. తర్వాత కళాశాల ప్రారంభ తేదీలు కనుక్కుందామని ఫోన్ చేయగా కలవలేదు. దంతో వారు నేరుగా వర్సిటీకి వెళ్లి ఆరా తీయగా అసలు వారి కూతురు పేరిట అడ్మిషన్ లేదని స్పష్టం చేశారు. దీంతో వారు మోసపోయామని గ్రహించి శుక్రవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అనిల్‌రెడ్డి ఇప్పటికే ఇదే మాదిరిగా 30మందిని మోసం చేశాడని.. వేరే పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్నాడని సీఐ తెలిపారు.

రాస్నం మీదుగా రాకపోకలు బంద్



డైవర్షన్ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న కాగ్నానది

ధారూరు: మండల పరిధిలోని దోర్నాల్–ధారూరు మధ్య రాకపోకలు మూడు రోజులుగా బంద్ అయ్యాయి. పోలీసులు అటుగా వెళ్లేందుకు యత్నించే వారిని అడ్డుకుంటున్నారు. గతేడాది ఆరుగురు వ్యక్తులు కాగ్నానదిని దాటేందుకు యత్నించి ఒకరు మృత్యువాత పడ్డారు. దీంతో పోలీసులు పహారా పెట్టి అటుగా ఎవరినీ రానీయడం లేదు. దోర్నాల్–స్టేషన్ ధారూరు నడుమ ప్రవహిస్తున్న కాగ్నా నదిలో డైవర్షన్ రోడ్డు మునిగిపోయింది. దీంతో ఆయా గ్రామాల వారికి దూరభారం పెరిగింది. ఆరు కిలోమీటర్లలో గ్యమం చేరే వారు 30 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుంది. గతేడాది మూడు నెలల పాటు రాకపోకలు స్తంభించాయని.. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి రాకపోలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

యాలాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించిన వీఆర్ఏ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. దేవనూరు గ్రామానికి చెందిన చిట్టిబాబు(30) వీఆర్ఏగా విధులు నిర్వహించేవాడు. గత ప్రభుత్వం వీరిని ఇతర శాఖాలకు బదలాయించడంతో మిషన్ భగీరథ విధులు నిర్వహించేవాడు. కుటుంబ గొడవల నేపథ్యంలో ఈ నెల 4న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని తాండూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం మృతుడి తల్లి హన్మమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



సందీప్ (ఫైల్)

మరోఘటనలో వీఆర్ఏ..

తాండూరు రూరల్: గుండె జబ్బుతో చికిత్స పొందుతున్న బాలుడు శుక్రవారం మృతి చెందాడు. వివరాలు మండల పరిధిలోని అంతారం సమీపం విజయనగర కాలనీలో నివాసం ఉంటున్న ఒంటెద్దులోతు రాజు కొడుకు సందీప్(8) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యులు పరీక్షించి గుండె జబ్బు ఉన్నట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి విషమించి ఉదయం మృతి చెందాడు. నిరుపేదలైన రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స.హ. చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శిగా అజయ్

సాక్షి,సిటీబ్యూరో: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా అజయ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంతటి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌కు, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులుకు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌కు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్‌కు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు భద్రాద్రి ఇన్‌చార్జిగా శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ అధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి నియమిస్తూ కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా పని చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు.

కులవృత్తులను ప్రోత్సహిద్దాం: మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: 'అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం సాధ్యం కాదు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కుల వృత్తులు బతకాలి. అప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుంది' అని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయ పడ్డారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి విగ్రహాలు వాడడం వల్ల కుల వృత్తులు బాగుపడతాయని, వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింథటిక్ శాలువాలకు బదులుగా కాటన్ శాలువాలు వాడితే చేనేత రంగానికి చేయూత ఇచ్చినట్లు ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మట్టి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణను పరిరక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్.పి, ఈ.వెంకటచారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులే కారణం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో తల్లి, పిల్లలు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో శుక్రవారం మరో మృతదేహాన్ని వెలికి తీశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్‌కు చెందిన ఓర్సు మంగ, కుమారుడు శరత్(7), కూతురు లావణ్య(17)లు గురువారం సాయంత్రం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. మున్సిపల్, పోలీసు, ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువులో గాలించి అదే రోజు రాత్రి తల్లీకుమారుడి మృతదేహాలు వెలికితీశారు. వర్షంతో పాటుగా చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. శుక్రవారం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా లావణ్య మృతదేహం లభ్యమైంది. దంపతుల మనస్పర్థలు.. ఆర్థిక ఇబ్బందులే కారణం సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. వీరి ఇరువురిదీ రెండో వివాహం.. రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్న కుమార్ ఎనిమిదేళ్ల క్రితం మంగను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. మంగ మొదటి భర్తకు జన్మించిన కుమార్తె లావణ్య వీరి వద్దే ఉంటుంది. వారం రోజులుగా ఏర్పడిన మనస్పర్థలతో

బలవన్మరణానికి పాల్పడిన ఘటనలో బాలిక మృతదేహం వెలికితీత



లావణ్య మృతదేహం

పాటుగా.. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. ముగ్గురు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇరు కుటుంబాల వారి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బురదలో చిక్కుకున్న ఆటో

రోడ్డు అధ్వానం.. బడికి ఆటంకం

దౌల్తాబాద్: మండలంలోని అల్లాపూర్ రోడ్డు అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం నుంచి గుముడాల మీదుగా అల్లాపూర్‌కు ఉన్న మట్టి రోడ్డు వర్షానికి పూర్తిగా బురదమయంగా మారింది. చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాలంటే ఇదే రోడ్డు దిక్కు. గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం పాఠశాలకు చెందిన ఓ ఆటోలో విద్యార్థులు వెళ్తుండగా బురదలో ఇరుక్కుపోయింది. గ్రామస్తులు కలిసి బురదలో నుంచి తీశారు.



బురదలో వెళ్తున్న పాఠశాలకు చెందిన విద్యార్థుల ఆటో

ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమత్తులు చేపట్టి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.